671) దేసాక్షి / రేవతి

ప॥ దాటలేను యీ మాయ దైవమా నేను । నీటున జేసేవాడవు నీవె నీవెకా ॥

చ॥ యీమురికిదేహమేకా యెంతగాలమైన నేను । వోముకుంటా భువిమీద నుండగోరేది ।
దోమటినింద్రియాలేకా తోడునీడయ నన్ను । వేమరు భోగించజేసి వెనుబలమైనవి ॥

చ॥ పొంచిన నాకర్మమే పుట్టించి పుట్టించి । పంచల సంసారముపాలు సేసేది ।
అంచెల నీచిత్తమేకా ఆసలాసలను దిప్పి । చంచుల నాకేపొద్దు చనవరియయ్యేది ॥

చ॥ చుట్టుకొన్న సంపదేకా సూటియైననాటికి । జట్టిగొని లోలోనే చవిసేసేది ।
అట్టె శ్రీవేంకటేశ అంతరంగాన నీవెకా । పట్టుగొమ్మవై యుండగ బదికేది నేను ॥